

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 129 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 09, ఏప్రిల్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# ఎండలు మండిపోతున్నాయి !

## భానుడు బగ్గుమంటున్నాడు



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**


ఎండ తీవ్రత పెరిగి పోతుండడంతో ప్రజల్లో తీవ్రమైన ఆందోళన ఏర్పడుతుందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. ప్రధాన ప్రాంతాల్లోని అడవులను, చెట్లను నరికి వేస్తున్నారని దానివల్ల ఎండ తీవ్రత ఏర్పడే ఆస్కారం ఉందని తెలిపారు. ఎండ తీవ్రతతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని గుర్తు చేశారు. ఏప్రిల్ మాసంలోనే ఇంతటి తీవ్రమైన ఎండలు ఉంటే మే మాసంలో ఇంకెంతటి తీవ్రమైన ఎండలు వచ్చే ఆస్కారం ఉందో పసిగట్టడం చాలా కష్టంగా ఉందన్నారు. ఈ మధ్యకాలంలో వడగండ్ల వానలు కురిసినట్టే కురిసి ఒక్కసారిగా భూమి లోపలి ఆవిరిని ఎండ రూపంలో వెలికితీసాయని దాని ప్రభావం వల్ల కూడా ఎండ తీవ్రత పెరిగిపోయిందని తెలిపారు. ఒకవైపు చెరువులు ఎండిపోతుండగా భూగర్భ జలాలు అంతరించిపోతుండగా తాగునీటి కొరత ఎక్కువగా ఏర్పడుతుందని పల్లె ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం కొరతగా ఇప్పటికే ఏర్పడిందని కొన్ని

- మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- ఏప్రిల్ మాసంలోనే ఇంతటి తీవ్రమైన ఎండ
- వేడి తీవ్రతను తట్టుకోలేకపోతున్న ప్రజలు
- ఎండ తీవ్రతకు జ్వరాల బారిన పడుతున్నారు
- అడ్డకాడి కూలీలు,కార్మికులు మండుటెండలో కూలి పని చేస్తున్నారు
- ట్రాఫిక్ పోలీసులు ఎండను భరిస్తూ విధులు నిర్వహిస్తున్నారు
- అడవులను నరికి వేస్తున్నందున వేడి తీవ్రత పెరుగుతుంది
- భూగర్భ జలాలు అంతరించిపోవడం వల్ల ఎండ తీవ్రత పెరుగుతుంది
- మే మాసంలో భయంకరమైన ఎండలు పెరిగే అవకాశం ఉంది
- ప్రభుత్వాలు ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి : డాక్టర్ బరిగెల శివ



## మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను

### పినరయి విజయన్ కు రేవంత్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ, కేరళ రాష్ట్రాల మధ్య అభివృద్ధిపై మొదలైన మాటల యుద్ధం మరింత ముదిరింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఘాటైన పదజాలంతో, స్పష్టమైన గణాంకాలతో బదులిస్తూ ఒక బహిరంగ లేఖ రాశారు. తాను గౌరవప్రదంగా విమర్శలు చేసినప్పటికీ, విజయన్ మాత్రం అమర్యాదకరమైన భాషను ఉపయోగించారని రేవంత్ ఆక్షేపించారు. "మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను" అంటూ చురక అంటించిన ఆయన, మీరు మా రాష్ట్రానికి వచ్చినప్పుడు అతిథికి ఇవ్వాల్సిన పూర్తి గౌరవం



2

## హైదరాబాదులో... ఏసీబీ వలకు చిక్కిన ఇద్దరు ఎయిర్ పోర్టు పోలీసు అధికారులు



2


## బేగంపేటలో పైలట్ శిక్షణా విద్యార్థినిపై అత్యాచారం


2

## హైడ్రా పనితీరుకు జాతీయ ఖ్యాతి..

### చెన్నైలోనూ అమలుకు సీఎండీఏ ఆసక్తి!

2



## కేసీఆర్, హరీశ్ పిటిషన్లు..

### పీసీ ఘోష్ కమిషన్ పై తీర్పు వాయిదా వేసిన హైకోర్టు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకల కేసును విచారించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. కమిషన్ భవితవ్యం ఏమిటన్నది తేల్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం మరికొంత సమయం తీసుకుంది. ఈరోజు ఈ వ్యవహారంపై వాదనలు విన్న చీఫ్ జస్టిస్ ధర్మాసనం, తుది తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ వివాదం 2024 మార్చిలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 6తో మొదలైంది. మేడిగడ్డ, అన్నారం వంటి బ్యారేజీల వైఫల్యాల వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీయాలని ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే, దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు స్మితా సభర్వాల్ వంటి కీలక అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందని, కనీసం తమ వాదనలు కూడా వినకుండా అభియోగాలు మోపుతున్నారని వారు తమ పిటిషన్లలో పేర్కొన్నారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం తన నిర్ణయాన్ని బలంగా సమర్థించుకుంది. ఇప్పటికే రికార్డుల ఆధారంగా విచారణ జరిగిందని, అందరికీ నోటీసులు కూడా ఇచ్చామని కోర్టుకు వివరించింది. ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలు ముగిసినా, జడ్జిమెంట్ వాయిదా పడటంతో ఈ నెల 22వ తేదీ తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానుంది.

## కాజీపేటలో గంజాయి చాక్లెట్లు సీజ్

7 మంది యువకులు అరెస్ట్

ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల చర్యలు




**కాజీపేట, 08 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాజీపేట ప్రాంతంలో పోలీసులు నిర్వహించిన నిఘా చర్యల్లో భారీగా గంజాయి మరియు గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఏడుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, సబ్ ఇన్స్పెక్టర్ వి. లవన్ కుమార్ తన సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం కాజీపేటలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కడిపికొండ బ్రిడ్జి కింద కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించిన వెంటనే వారు పారిపోవడానికి ప్రయత్నించగా, అప్రమత్తమైన సిబ్బంది వెంటాడి వారిని పట్టుకున్నారు. తదుపరి తనిఖీల్లో నిందితుల వద్ద నుంచి 30 గ్రాముల ఎండు గంజాయి, 200 గంజాయి చాక్లెట్లు (సుమారు 930 గ్రాములు) స్వాధీనం చేసుకున్నారు. అదనంగా 6 స్మార్ట్ ఫోన్లు కూడా పోలీసులు సీజ్ చేశారు. పట్టుబడిన యువకులను విచారించగా, వారు కాశీ పర్యటనకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద తక్కువ ధరకు గంజాయి మరియు చాక్లెట్లు కొనుగోలు చేసి, స్థానికంగా వినియోగం మరియు విక్రయాల కోసం తీసుకువచ్చినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో కరీమాబాద్, ఉర్సుగుట్ట, వరంగల్ ప్రాంతాలకు చెందిన యువకులు ఉన్నారు. ఈ కేసులో నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని కాజీపేట పోలీసులు హెచ్చరించారు.

## హైదరాబాదులో... ఏసీబీ వలకు చిక్కిన ఇద్దరు ఎయిర్ పోర్టు పోలీసు అధికారులు



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) పోలీస్ అవుట్‌పోస్ట్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఓ కేసులో సహాయం చేసేందుకు లంచం తీసుకుంటున్న ఒక ఇన్‌స్పెక్టర్, ఒక సబ్-ఇన్‌స్పెక్టర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో చార్జిషీట్ వేయడానికి, ఫిర్యాదుదారుడి కుటుంబ సభ్యులను ఇరికించకుండా ఉండేందుకు ఇన్‌స్పెక్టర్ సంపత్ కనకయ్య, సబ్-ఇన్‌స్పెక్టర్ యు.కె. సిద్ధేశ్వర్ రూ. 5 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ. 2 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుంటుండగా, రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఈ ఆపరేషన్ తర్వాత ఇన్‌స్పెక్టర్ కనకయ్య నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టగా భారీగా నగదు బయటపడింది. ఆయన ఇంట్లో రూ. 33.97 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు కొన్ని ఆస్తి పత్రాలు కూడా లభించాయని, వాటిపై విచారణ జరుపుతున్నామని ఏసీబీ తెలిపింది. విధులను దుర్వినియోగం చేసి అక్రమ లబ్ధి పొందారనే ఆరోపణలపై ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసి, నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ తెలిపారు. కాగా, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను ఏసీబీ గోప్యంగా ఉంచింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్-ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. మంగళవారం కూడా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ గోవర్ధన్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సీడ్ లైసెన్సు కోసం రూ. 1 లక్ష లంచం తీసుకుంటూ ఆయన పట్టుబడ్డారు.

## బేగంపేటలో పైలట్ శిక్షణా విద్యార్థినిపై అత్యాచారం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లోని బేగంపేటలో ఒక పైలట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయుడే విద్యార్థినిపై అఘాయిత్యానికి ఒడిగట్టడం విచారకరం. వివరాల్లోకి వెళితే... బేగంపేటలో ఉన్న పైలట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న ఓ యువతిపై అదే సంస్థలో పనిచేస్తున్న నసీముద్దీన్ అనే వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కేరళకు చెందిన నిందితుడు, గతేడాది జనవరిలో శిక్షణ ఇస్తాననే సాకుతో ఆమెపై అత్యాచారం చేశాడు. మొదటిసారి అఘాయిత్యం చేసిన సమయంలో ఆ దృశ్యాలను ఫొటోలు, వీడియోలు తీసిన నిందితుడు, వాటిని సోషల్ మీడియాలో పెడతానని బాధితురాలిని బ్లాక్‌మెయిల్ చేశాడు. ఈ వీడియోలను అడ్డం పెట్టుకుని ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితుడి వేధింపులు భరించలేకపోయిన బాధితురాలు ఎట్టకేలకు బేగంపేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ వేధింపుల్లో దమ్మాయిగూడకు చెందిన సల్మాన్ అనే వ్యక్తి కూడా నిందితుడికి సహకరించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రధాన నిందితుడు నసీముద్దీన్‌ను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ కేసులో విచారణ కొనసాగుతోంది.

# ఎండలు మండిపోతున్నాయి

మొదటి పేజీ తరువాయి

ప్రాంతాల్లో మైళ్ళ కిలోమీటర్స్ నడుచుకుంటూ వెళ్లి పొలాల బావులలో నుండి ఇసుక ప్రాంతాల్లోని ఎడారి ఊటలలో నుండి మంచి నీరును తెచ్చుకునే పరిస్థితిలో ఏర్పడ్డాయన్నారు.ఎండ తీవ్రతను తట్టుకోలేక వృద్ధులు ప్రాణాలు కోల్పోతున్నారని చిన్నపిల్లలు అనారోగ్యాల పాలవుతున్నారని బాధపడ్డారు.వాటికి తోడు విపరీతమైన దోమల బెడద పెరిగిపోయిందని వాటన్నిటిపై ప్రభుత్వాలు త్వరితగతిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.ఎండ తీవ్రతతో మధ్యాహ్నం వేళ రవాణా సౌకర్యాలు పూర్తిగా నియంత్రించబడుతుండగా గ్రామాల ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వైద్య సౌకర్యాల కోసం వెళ్లాల్సిన సాధారణ ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రాష్ట్రంలో వేల సంఖ్యలోని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని ఊహాజనితంగా తెలుపుతున్నప్పటికిని లెక్కలేనన్ని గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యాలు ఇప్పటికీ లేవని గుర్తు చేశారు.ప్రజల ఆరోగ్యాల పట్ల గ్రామస్థాయి పబ్లిక్ హెల్త్ సెంటర్స్ మెరుగుపరచాల్సిన వైద్య శాఖ అధికారులు మెరుగైన వైద్యం కోసం కావలసిన సౌకర్యాలను మందులను నిధులను కేటాయించడంలో విఫలం అవుతూనే ఉన్నారని గుర్తు చేశారు.చాలాచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయబడాల్సి ఉంటుండగా ఇప్పటివరకు ఎక్కడ ప్రజా తాగునీటి సౌకర్యం కల్పించడం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లుగా పెద్దగా కనిపించడం లేదన్నారు.కేవలం ఎండ తీవ్రత వల్లే మనుషుల ఆరోగ్యాలు పాడవుతున్నాయని చిన్నపిల్లలు మొదలుకొని యవనస్తులు పెద్ద మనుషులు వృద్ధులు ప్రతి ఒక్కరు ఎండ తీవ్రతకు బాధితులు గానే మారిపోతున్నారని గుర్తు చేశారు.ఇల్లు లేని పేదల పరిస్థితైతే మరింత దారుణంగా ఉందన్నారు.తలవాల్చుకోవడానికి పూరి గుడిసెలు సైతం లేని కుటుంబాలు లక్షల సంఖ్యలో కలవన్నారు.ఎండ తీవ్రత వల్ల ప్రజలకు జరిగే నష్టాలను జిల్లాల వారీగా అంచనా వేస్తూ ప్రజలకు ప్రభుత్వాలు తరఫున తగు జాగ్రత్తల తకొడిన చర్యలు తీసుకోబడుతూ నిత్యవసర సౌకర్యాలు కల్పించాల్సి ఉందని గుర్తుకు చేశారు.ప్రధానంగా ఎండ తీవ్రతతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల పంట నష్టం జరుగుతుందని సూర్యోదయం మొదలుకొని సూర్యాస్తమయం వరకు భగభగ మండే ఎండలు పంట పొలాలను వరి పంటలను అన్ని రకాల వ్యవసాయాలకు సంబంధించిన ఉత్పత్తులను నష్టపరుస్తున్నాయని వాటి వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని గుర్తు చేశారు.ఒకవైపు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందక మరొకవైపు తీవ్రమైన ఎండ తాకిడికి పంటలు నష్టం జరుగుతుండగా వాటిని చూస్తూ తట్టుకోలేని రైతాంగం కన్నీరు పెట్టుకుంటుందన్నారు.దినదినం తీవ్రంగా పెరుగుతున్న ఎండ తాకిడికి రైతులు కూడా పొలాల్లో పని చేయలేకపోతున్నారని రాత్రివేళలో కరెంటు కోతలు మధ్యాహ్నం వేళలో ఎండ తీవ్రతలు రైతులను తీవ్రమైన కష్టాల్లోనికి నెట్టివేస్తున్నయన్నారు. అన్నిటికన్నా ప్రధానంగా విద్యాశాఖలో స్కూల్ విద్యార్థులు మొదలుకొని ఉన్నత విద్య వరకు ఒంటిపూట బడులు మొదలుకొని ఒకటి గంటలలోపు విద్యాసంస్థలు అన్ని తరగతులు పూర్తి చేయబడే విధంగా ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.పదవ తరగతి పరీక్షలు జరుగుతుండగా విద్యార్థిని విద్యార్థులు ఎండ వేడిమిని తట్టుకొని పరీక్షలు రాస్తుండడం పరీక్ష కేంద్రాల్లో కావలసిన నీటి సౌకర్యాలను మజ్జిగ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నడం ఒక రకంగా విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.ఎండ వేడిమి అనేది మనుషులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుండగా వేడి పదార్థాలు వేడి వస్తువులను ఎక్కువగా ఉపయోగించకుండా తగు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.పశు వుల కాపరులు మొదలుకొని అడ్డ కాడికి కూలీలు రైతులు కార్మికులు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఇంటర్ సెక్టర్ బ్లూ కోడ్స్,ఇంటర్సెప్టర్ పోలీస్ సిబ్బందులు తీవ్రమైన ఎండలో పనులు చేస్తున్నారని వాళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు బాధ్యత కలిగిన సమాజంలోని అభివృద్ధి చెందిన వ్యక్తులపై ఉందని గుర్తు చేశారు.రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అన్ని మండల కేంద్రాల్లో అన్ని ప్రాథమిక ప్రాంతాల్లో తక్షణమే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మంచినీటి సౌకర్యం ఎంతోమంది ప్రాణాలను ఎండ దెబ్బ నుండి కాపాడుతుందని కనీసం ప్రజల నిత్యవసరంలో భాగమైన మంచినీటినైనా సకాలంలో అందించగలిగితే ప్రజలకు కొంతైనా మేలు చేయగలిగిన వారము అవుతామని తెలిపారు.రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు గ్రామస్థాయి సర్పంచులు వాళ్లకు తోచిన విధంగా రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాలలో ఎండ తీవ్రతను తట్టుకొని సేద తీరడానికి చల్లటి గుడిసె లాంటి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.ఎంతో అత్యవసరమైతే తప్ప ప్రజలు మధ్యాహ్నం వేళలో బయటకు రాకూడదనేది స్పష్టంగా వెల్లడించారు.ఆస్తులను సంపాదించడం ఎంతైతే అవసరమో వడదెబ్బల నుండి ఎండ దెబ్బల నుండి ప్రాణాలను కాపాడుకోవడం కూడా అంతే అవసరమని ప్రజలు ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకుంటూనే ఎండ తీవ్రతను తట్టుకోగల రక్షణ చర్యలకు అలవాటు పడాలని అలాంటప్పుడే ఏప్రిల్ మాసం మే మాసంలోని ఎండలను కాస్తయినా తట్టుకోగలమని గుర్తు చేశారు.దేశవ్యాప్తంగా కార్మికుల పరిస్థితి కార్మిక కూలీల పరిస్థితి అన్ని ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో పనిచేస్తున్న సెక్యూరిటీ (గార్డుల) సిబ్బంది పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని వాళ్లందరికీ మంచినీటి సౌకర్యాలను,మజ్జిగ సౌకర్యాలను కల్పిస్తూ ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వాలకు అతీతంగా ప్రజా సేవకులకు అతీతంగా మనకు మనమే సహాయం చేసుకోవాలని ఇంతటి ఎండ తీవ్రతను తట్టుకోవడానికి ఒకరికి ఒకరం సహాయపడటంతో పాటు రైతాంగాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రత్యేకంగా తెలిపారు.

## హైడ్రా పనితీరుకు జాతీయ ఖ్యాతి..

చెన్నైలోనూ అమలుకు సీఎండీఏ ఆసక్తి!

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, నాలాల పునరుద్ధరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) పనితీరు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. హైదరాబాద్ నగరంలో హైడ్రా చేపడుతున్న చర్యలను ఆదర్శంగా తీసుకుని, తమ నగరంలో వరదల నివారణకు వినియోగించుకోవాలని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు సీఎండీఏ ఉన్నతాధికారుల బృందం ఒకటి హైదరాబాద్‌లో పర్యటించి, హైడ్రా కార్యకలాపాలను అధ్యయనం చేసింది. ఈ ప్రశంసలకు తగ్గట్టుగానే హైడ్రా తన దూకుడును కొనసాగిస్తూ నగరంలో మరో భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో రూ.1,200 కోట్ల విలువైన 8 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఖానామెట్‌లోని సర్వే నంబర్ 55లో ఉన్న ఈ అత్యంత విలువైన భూమిని కొన్ని ప్రైవేటు నిర్మాణ సంస్థలు ఆక్రమించుకుని, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టాయి. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్నారు. వెంటనే అక్కడి తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేసి, స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆ భూమి చుట్టూ కంచె వేసి, ప్రభుత్వ ఆస్తి అని సూచించే బోర్డులను ఏర్పాటు చేశారు. ఇటీవల చెన్నై నుంచి వచ్చిన సీఎండీఏ అధికారుల బృందం హైడ్రా పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిసింది. ముఖ్యంగా నాలాలు, చెరువుల పునరుద్ధరణలో హైడ్రా అనుసరిస్తున్న వ్యూహాలపై వారు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వారికి అమీర్‌పేట, ప్యాట్నీ నాలాల విస్తరణ పనుల పురోగతిని, వాటి ద్వారా వరద ముప్పును తగ్గించే ప్రణాళికలను వివరించినట్లు సమాచారం. హైడ్రా పనితీరు అద్భుతంగా ఉందని, ఈ మోడల్‌ను చెన్నైలో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని సీఎండీఏ బృందం కొనియాడినట్లు తెలిసింది. 2024లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా అనతికాలంలోనే తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. చెరువులు, పార్కులు, నాలాలతో పాటు విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు కవచంలా నిలుస్తోంది.

## హైదరాబాద్‌లో రూ.64.35 లక్షల డ్రగ్స్ స్వాధీనం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుకున్నారు. చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి, రూ.64.35 లక్షల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో డ్రగ్స్‌తో పాటు రూ.50,000 నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులు గతంలో ఉద్యోగాలు చేశారని, ఆ తర్వాత టైల్స్ వ్యాపారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ వ్యాపారంలో నష్టం రావడంతో ఆ తర్వాత డ్రగ్స్ వ్యాపారంలోకి వచ్చారని చెప్పారు.




## మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను

మొదటి పేజీ తరువాయి

ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు, ఇదే నా చివరి స్పందన అంటూ రేవంత్ రెడ్డి తన లేఖను ఎక్స్‌లో పంచుకున్నారు. తెలంగాణ ప్రస్తుత పనితీరుపై తీర్పు ఇవ్వడానికి పినరయి విజయన్ 2023-24 నాటి నీతి ఆయోగ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచీని ఉటంకించడంపై రేవంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సూచీ పదేళ్ల బీఆర్ఎస్-బీజేపీ పాలన చివరి రోజులను ప్రతిబింబిస్తుందని, 28 నెలల క్రితం 2023 డిసెంబరులో ఆ పాలన ముగిసిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ పనితీరును కొత్త గణాంకాలతో అంచనా వేయాలని ఆయన సవాలు విసిరారు. "2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 16.12 లక్షల కోట్లకు చేరింది. జాతీయ సగటు 9.9 శాతం ఉండగా, తెలంగాణ వృద్ధి రేటు 10.1 శాతంగా నమోదైంది. ఆర్బీఐ స్టాటిస్టిక్స్ 2024-25 నివేదిక ప్రకారం, రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 3.87 లక్షలకు పెరిగింది. ఈ విషయంలో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, చివరకు కేరళను కూడా అధిగమించి దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది" అని రేవంత్ రెడ్డి తన లేఖలో స్పష్టంగా వివరించారు. కేరళ సాధించిన విజయాలు కొన్ని దశాబ్దాల కృషి ఫలితమని అంగీకరిస్తూనే, ప్రత్యేకంగా విజయన్ హయాంలో ఏం జరిగిందో అక్కడి ప్రజలకు వివరించాలని హితవు పలికారు. 2025 చివరి నాటికి కేరళ తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన తొలి రాష్ట్రంగా అవతరిస్తుందని విజయన్ చేసిన ప్రకటనను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. "ఇప్పుడు ఏప్రిల్ 2026 నడుస్తోంది. ఇంకా 64,006 కుటుంబాలకు మైక్రో-ప్లాన్‌లు అందుతున్నాయని మీరే లేఖలో చెబుతున్నారు. మరి తీవ్ర పేదరికం నిజంగా నిర్మూలించబడిందా? నవంబర్ 1, 2025 నాటి మీ ప్రకటనను ఏదైనా స్వతంత్ర సంస్థ ధృవీకరించిందా?" అని నిలదీశారు. నీతి ఆయోగ్ అవినీతి ర్యాంకింగ్స్‌ను తాను గౌరవిస్తానని, కానీ కేరళ నిజంగానే అవినీతి రహిత రాష్ట్రమైతే ముఖ్యమంత్రి కార్యాలయంతో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న గోల్డ్ స్మగ్లింగ్ కేసు ఎందుకు పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. అలాగే, శబరిమల అయ్యప్ప ఆలయం నుంచి మాయమైనట్లు ఆరోపణలున్న 4.5 కిలోల బంగారం లెక్క తేలలేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ దార్శనికతను వివరిస్తూ.. 'తెలంగాణ రైజింగ్' తమ లక్ష్యమని రేవంత్ పేర్కొన్నారు. దశాబ్దంలో రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ధ్యేయమన్నారు. హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ', జహీరాబాద్‌లో 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్' ఈ లక్ష్య సాధనకు మూలస్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు. కేరళలో రాబోయే కొత్త ప్రభుత్వం 'నవ కేరళం' విజన్‌ను అమలు చేస్తుందని తాను విశ్వసిస్తున్నానని, త్వరలోనే అక్కడి ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారంటూ విజయన్‌కు చురకలు అంటించారు.

## 200 యూట్యూబ్ చానళ్లను బీఆర్ఎస్ కొనుగోలు చేసింది: జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



అక్రమంగా గడించిన వేల కోట్ల రూపాయలతో బీఆర్ఎస్ పార్టీ ఏకంగా 200 యూట్యూబ్ ఛానెళ్లను కొనుగోలు చేసి, ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికగా బీఆర్ఎస్ బురదజల్లుతోందని, వీటిని కాంగ్రెస్ కార్యకర్తలు దీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కేవలం ఇంట్లో కూర్చుంటే అధికారం రాదని, 'మంత్రాలకు చింతకాయలు రాలవు' అనే నిజాన్ని గుర్తించి ఫీల్డ్‌లోకి వెళ్లి పని చేయాలని సూచించారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు, రాష్ట్రంలో పార్టీని నిలబెట్టేందుకు ప్రతి కార్యకర్త రోజుకు ఒక గంట సమయం కేటాయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో నియామకాలు



ఉత్తర్వులు అందుకుంటున్న - ఆచార్య వెంకట్రామరెడ్డి, ఆచార్య రాజేందర్ కట్ల



వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ని కలసిన పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక బాధ్యులు

**పర్యావరణ చర్యలు, విద్యా కార్యక్రమాలకు ఊతం**

**కాకతీయ యూనివర్సిటీ / జై భీమ్ న్యూస్ :**

ఓఎస్డీగా ఆచార్య వెంకట్రామరెడ్డి నియామకం.. కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిపాలన రంగంలో కీలక నిర్ణయం తీసుకుంటూ భౌతిక శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య బి. వెంకట్రామరెడ్డిని ఒక సంవత్సర కాలానికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓ.ఎస్.డి)గా నియమించారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం టీజీఈడి సి డిటి కన్వీనర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

**సిపిజిఈటి-2026 కన్వీనర్‌గా ఆచార్య రాజేందర్ నియామకం**

2026--27 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా పీజీ ప్రవేశాల కోసం నిర్వహించే సిపిజిఈటి--2026కు కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగ ఆచార్యులు ఆచార్య రాజేందర్ కట్లను కన్వీనర్‌గా నియమించారు. వివిధ కీలక పదవుల్లో సేవలందించిన ఆయన ప్రస్తుతం పరీక్షల నియంత్రణ అధికారి, కామర్స్ విభాగ డీన్‌గా కొనసాగుతున్నారు. ఆయన నియామకంపై విశ్వవిద్యాలయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

**పర్యావరణ పరిరక్షణకు చర్యలు**

పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక (యుఎఫ్ఈపి) ప్రతినిధులు వైస్ ఛాన్సలర్‌ను కలిసి పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, తడి చెత్తతో కంపోస్ట్ తయారీ, ప్రహరీ గోడ నిర్మాణం, బొటానికల్ గార్డెన్ ఏర్పాటు వంటి అంశాలపై వినతి పత్రం సమర్పించారు. ఈ ప్రతిపాదనలపై వైస్ ఛాన్సలర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

**'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగస్వామ్యం**

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా బయోటెక్నాలజీ విభాగాన్ని విద్యార్థులు సందర్శించారు. విభాగాధిపతి డా. టి. శాస్త్రి ఆధునిక ప్రయోగాలు, పరిశోధన విధానాలు, పరికరాల వినియోగంపై వివరించారు. సెమినార్‌లు, ప్రదర్శనల ద్వారా బయోటెక్నాలజీ రంగంలోని అవకాశాలపై అవగాహన కల్పించారు.

**విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథానికి ప్రోత్సాహం**

ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తి పెంపొందించడంతో పాటు శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చెందుతుందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా, బయో టెక్నాలజీ విభాగాన్ని సందర్శించిన కే.డిసి. . విద్యార్థులు

# వేయి స్తంభాల ఆలయాన్ని సందర్శించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**ఆలయంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు.**
**కేంద్ర మంత్రులు, పురావస్తు శాఖ అధికారుల సమన్వయంతో నిధులు తీసుకొచ్చాం**
**యునెస్కో గుర్తింపు లక్ష్యంగా ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా**

**హనుమకొండ / జై భీమ్ న్యూస్ :**

చారిత్రక ప్రాధాన్యం గల వేయి స్తంభాల ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 14.44 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చేపట్టబోయే అభివృద్ధి పనులపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ముందుగా స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ఆలయానికి చేరుకున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య గారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కేంద్ర నిధులు సాధించడం ఆనందదాయకమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. పలుమార్లు కేంద్ర మంత్రులు, పురావస్తు శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ ప్రతిపాదనలు సమర్పించిన ఫలితంగానే ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇప్పుడు ఇతర పార్టీలు కృషి చేయకుండా తామే చేశామంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వానికి గతంలో పంపిన ప్రతిపాదనల వివరాలను స్వయంగా మీడియాకు వెల్లడించారు. ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర మంత్రితో పాటు సంబంధిత అధికారులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. మొదట రూ. 10 కోట్ల నిధులు కోరగా, ప్రభుత్వం చివరకు రూ. 14 కోట్లకు పైగా మంజూరు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ నిధులను పూర్తిగా ఆలయాల అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియను త్వరలో ప్రారంభించి, వివిధ భాగాల అభివృద్ధికి తుది నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబర్ నెలల్లో కేంద్ర మంత్రులు, పురావస్తు విభాగం డైరెక్టర్ జనరల్‌కు లేఖలు రాస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరినట్లు వివరించారు. ఆలయ పరిసరాలను ల్యాండ్స్కేపింగ్ ద్వారా మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర వనరుల నుంచి తొలుత రూ. 4 కోట్ల ప్రతిపాదన వచ్చినప్పటికీ, అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా నిధులు సాధించినట్లు పేర్కొన్నారు. అవసరమైతే మరిన్ని నిధులను కూడా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతానికి యునెస్కో గుర్తింపు సాధించాలంటే వారసత్వ సంపదను పరిరక్షిస్తూ అభివృద్ధి చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. వరంగల్ ఈస్ట్ పరిధిలో ఉన్న సుమారు 14 ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పార్కులు, ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా వరంగల్‌ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో ఈ పనులు త్వరితగతిన పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆశలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తూ వరంగల్ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే,మేయర్

**వడ్డేపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం**
**పదేళ్లలో పడకేసిన పనులకు శ్రీకారం చుట్టాం**

**వడ్డేపల్లి / జై భీమ్ న్యూస్ :**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని వడ్డేపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన వడ్డేపల్లి ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం 60వ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లిలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , బల్దియా మేయర్ గుండు సుధారాణి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత పదేళ్లలో వడ్డేపల్లి అభివృద్ధి కోసం ఎలాంటి కృషి జరగలేదని, ప్రజా పాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. దవాఖాన, స్మశాన వాటిక, అంతర్గత రహదారులు, సైడ్ డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిని దశలవారీగా చేపట్టామని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో రాజకీయ పక్షపాతం ఉండదని, అన్ని డివిజన్‌లలో సమానంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బిజెపి , బీఆర్ఎస్ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులపైనా ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఉన్నప్పటికీ అభివృద్ధికి సరైన సహకారం అందలేదని విమర్శించారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలోనే ప్రతి డివిజన్‌కు సమపాళ్లలో నిధులు కేటాయించి, అభివృద్ధి పనులను వేగవంతం చేశామని తెలిపారు. పూర్తి గ్రామీణ వాతావరణం కలిగిన వడ్డేపల్లి, శాయంపేట, సోమిడి ప్రాంతాలను నగరంలోని ప్రధాన కాలనీలకు దీటుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని, ప్రతి కుటుంబానికి మౌలిక సదుపాయాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్





**(ముల్కనూర్ జై భీమ్ న్యూస్)**

ఈ రోజు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సీపీ పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామీణ ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించాలని, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ గ్రామాల హిస్టరీ షీట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు, సిబ్బంది గ్రామాల పర్యటనలను తరచుగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో , సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, ఎస్. ఐ రాజు పాల్గొన్నారు.

# చైతన్యపురి కాలనీలో పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన




**హనుమకొండ / జై భీమ్ న్యూస్ :**

61వ డివిజన్ పరిధిలోని చైతన్యపురి కాలనీలో స్థానిక ప్రజలు నిర్మించుకుంటున్న పోచమ్మ తల్లి ఆలయానికి ఈ రోజు శంకుస్థాపన కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. స్థానిక ప్రజలు చేపడుతున్న ఈ ఆలయ నిర్మాణం ప్రాంతీయ ఆధ్యాత్మికాభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి, ప్రజల అవసరాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అక్రమ టోల్ టాక్స్ రద్దు చేయాలి

**బోర్నపల్లి -కిష్టంపేట చలివాగులో అక్రమ వసూలు..**
**పట్టించుకోని అధికారులు**
**ఎమ్మార్పీఎస్(టీఎస్) జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ..**





**జయశంకర్ భూపాలపల్లి / జై భీమ్ న్యూస్ :**

టేకుమట్ల మండలంలోని బోర్నపల్లి-కిష్టంపేట గ్రామాల మధ్యలో ఉన్న చలివాగుపై కొంతమంది అక్రమార్కులు టోల్ టాక్స్ పేరిట అక్రమ వసూల్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ (టీఎస్ )జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది చలివాగులో రోడ్ నిర్మాణం చేసే రోడ్డు పై నుండి ప్రయాణం చేసే వాహనానికి ఒక రేటు వారే నిర్ణయించుకుని, టోల్ టాక్స్ పేరిట డబ్బులు వసూల్ చేస్తున్నారని, ఇదేంటని అడిగిన ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరిస్తున్నారని,ఇంత దందా జరుగుతున్న సంబందిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని, ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ టోల్ టాక్స్ వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు..

# హనుమకొండలో రేషన్ దుకాణాల సమయాలు

**మూడు నెలల బియ్యం ఏప్రిల్‌లోనే పంపిణీ**
**జిల్లా పౌర సరఫరా అధికారి మహమ్మద్ వాజిద్ అలీ**

**హన్మకొండ, 08 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ పట్టణ జిల్లాలోని ఆహార భద్రతా కార్డు కలిగిన లబ్ధిదారులందరికీ జిల్లా పౌర సరఫరా అధికారి మహమ్మద్ వాజిద్ అలీ కీలక సూచనలు జారీ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రేషన్ పంపిణీ సజావుగా కొనసాగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాలు ప్రతిరోజూ ఉదయం 8.00 గంటల నుంచి 11.00 గంటల వరకు, అలాగే సాయంత్రం 4.00 గంటల నుంచి 8.00 గంటల వరకు పనిచేస్తాయని స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఈ సమయాలను గమనించి తమకు అనుకూలంగా రేషన్ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఏప్రిల్ నెలలోనే పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా లబ్ధిదారులు తరచూ రేషన్ దుకాణాలకు రావాల్సిన అవసరం లేకుండా సౌకర్యం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. జిల్లాలో సరిపడా బియ్యం నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ మూడు నెలల రేషన్ పంపిణీ ప్రక్రియ ఏప్రిల్ 30వ తేదీ వరకు కొనసాగుతుందని, అందరూ గడువు లోపు తమ వాటాను తీసుకోవాలని సూచించారు. రేషన్ తీసుకునే సమయంలో లబ్ధిదారులు శాంతంగా, క్రమపద్ధతిలో వ్యవహరించాలి, ఎలాంటి గొడవలు లేదా గందరగోళాలకు తావు ఇవ్వకూడదని కోరారు. రేషన్ డీలర్లతో సహకరించి పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని కుటుంబ అవసరాల కోసం మాత్రమే వినియోగించుకోవాలని, దానిని దుర్వినియోగం చేయడం లేదా అక్రమంగా విక్రయించడం వంటి చర్యలు తీవ్రంగా శిక్షార్హమని హెచ్చరించారు. రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలు, తేడాలు గమనించినట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అలాంటి ఘటనలపై ప్రభుత్వం కఠిన



చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించి, రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

## కమలాపూర్ మండల బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా జెర్రిపోతుల రాజేందర్

**కమలాపూర్, 08 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**



కమలాపూర్ మండలంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మోర్చా కమిటీలు ప్రకటించిన నేపథ్యంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా జెర్రిపోతుల రాజేందర్ నియమితులయ్యారు. సంఘటనా సమరచన పర్వ్--2025 కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్షుడు మరియు జిల్లా సమరచన ప్రభారి సమ్మతితో ఈ నియామకాలు జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కమిటీలు ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. జెర్రిపోతుల రాజేందర్ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ, సామాజిక సేవలో ముందుండే నాయకుడిగా గుర్తింపు పొందిన నేపథ్యంలో ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో ఎస్సీ మోర్చా మరింత చురుకుగా పనిచేస్తూ, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జెర్రిపోతుల రాజేందర్ మాట్లాడుతూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని, మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు.

## నూతన ఈవీఎం గోదాముకు ఈవీఎంల తరలింపు

**రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**




**హన్మకొండ, 08 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని తాత్కాలిక ఈవీఎం గోదాముల నుండి హనుమకొండ జిల్లాకు చెందిన ఈవీఎంలను బుధవారం పటిష్ట భద్రత మధ్య ప్రత్యేక వాహనాల్లో నూతనంగా నిర్మించిన శాశ్వత గోదాముకు తరలించారు. ఈ గోదాం హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని రెడ్ క్రాస్ భవనం వెనుక ఏర్పాటు చేయబడింది. జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు, వివిప్యాట్ యంత్రాలను భద్రపరిచిన బాక్సుల తరలింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి స్వయంగా పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎనుమాముల మార్కెట్ యార్డులోని గోదాములపై ఉన్న సీల్స్‌ను తెరిచి, ఈవీఎంలు మరియు వివిప్యాట్ బాక్సులను నూతన గోదాముకు తరలించారు. ఈ మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. పోలీస్ భద్రత మధ్య ఈ తరలింపు కార్యక్రమం సజావుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, రాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ శ్యాం కుమార్ పాల్గొన్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్యాంసుందర్, రజనీకాంత్, ఎండి నేహాల్, మహమ్మద్ రహీం ఖాన్, వీరానంద్ తదితరులు హాజరయ్యారు.

## 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'పై దాడి

**సరైన చర్య అంటూ పూనమ్ కౌర్ ట్వీట్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడికి యత్నించిన ఘటనపై సినీ నటి పూనమ్ కౌర్ స్పందించారు. ఈ ఘటనను సమర్థిస్తూ ఆమె సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. మహిళలను కించపరిచేలా మాట్లాడితే ఇలాంటి చర్యలు అవసరమేనని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై పూనమ్ కౌర్ స్పందిస్తూ, "మహిళలను, వారి సంబంధాలను అవమానించేలా, పూర్తి స్త్రీ ద్వేషంతో మాట్లాడినప్పుడు జగన్మోహన్ రెడ్డి గారి మద్దతుదారులు తీసుకున్న చర్య సరైనదే. ఇలాంటి చర్యలు చాలా అవసరం. అలా మాట్లాడేది ఎవరైనా సరే, వారికి ఇలాగే జరగాలి" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, మీడియా ఛానెళ్లపై కూడా ఆమె తీవ్ర విమర్శలు చేశారు. "నేటి న్యూస్ ఛానెళ్లు బ్లాక్‌మెయిలింగ్ బాక్సులుగా మారాయని నేను ఎప్పటినుంచో చెబుతున్నాను" అని ట్వీట్ చేశారు.

## విధుల్లో నిబద్ధతకు గౌరవం

**కానిస్టేబుల్ రవీందర్‌కు కమిషనర్ ప్రశంసా పత్రం**




**హన్మకొండ జిల్లా/హాసన్ పర్తి, 08 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిలో క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత ఎంత ముఖ్యమో మరోసారి రుజువైంది. హాసనపర్తి పోలీస్ స్టేషన్‌లో కోర్ట్ ప్రాసెస్ విధులు నిర్వహిస్తున్న జి. రవీందర్ (హెచ్.జి 228) తన విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. కోర్టు సంబంధిత విధుల్లో ఖచ్చితత్వం, సమయపాలన, బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా రవీందర్ ప్రత్యేక గుర్తింపు పొందారు. కేసులకు సంబంధించిన నోటీసులు, సమన్లు సరైన వ్యక్తులకు సమయానికి అందజేయడం, కోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయడం వంటి అంశాల్లో ఆయన చూపిన శ్రద్ధను అధికారులు అభినందించారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ పనులు పూర్తి చేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. ఈ క్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ రవీందర్ పనితీరును మెచ్చుకుని ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సత్కారం ఆయన కృషికి గుర్తింపుగా నిలిచింది. అదేవిధంగా, హాసనపర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వి. చేరాలురవీందర్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రవీందర్ వంటి సిబ్బంది పోలీసు శాఖకు ఆస్తి అని, వారి సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సత్కారం ద్వారా ఇతర సిబ్బందిలో కూడా మరింత ఉత్సాహం, బాధ్యతాభావం పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందనే సందేశాన్ని రవీందర్ సత్కారం అందరికీ తెలియజేస్తోంది.

## హసన్పర్తిలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**76 మంది లబ్ధిదారులకు రూ.76 లక్షల ఆర్థిక సాయం**



**హన్మకొండ జిల్లా/హాసన్ పర్తి, 08 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

హాసన్ పర్తి మండల కేంద్రంలోని ట్రైనింగ్ సెంటర్‌లో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు 76 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.76,08,816 విలువైన చెక్కులను అందజేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1, 2, 55, 56, 65, 66 డివిజన్లు మరియు హసన్పర్తి ప్రాంతానికి చెందిన లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కుమార్తెల వివాహ సమయంలో ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కూడా పేదలకు వైద్య సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ట్రాక్ చేసి యజమానికి అప్పగింత




**మహబూబాబాద్, 08 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

మహబూబాబాద్ పట్టణ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను పోలీసులు సాంకేతిక సహాయంతో ట్రాక్ చేసి యజమానికి అప్పగించారు. సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఈఐఆర్) పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను గుర్తించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. సుమారు రూ.26 వేల విలువగల మొబైల్ ఫోన్‌ను యజమాని వేణుకు అందజేశారు. ఈ ట్రాకింగ్ ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన సిఈఐఆర్ టెక్నికల్ సిబ్బంది పీసీ సురేందర్‌ను సీఐ అభినందించారు. పోలీసుల వేగవంతమైన చర్యలతో పోగొట్టుకున్న మొబైల్ తిరిగి లభించడంతో బాధితుడు సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం



**హన్మకొండ, 08 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జన్మదినాన్ని ప్రతి సంవత్సరం ప్రపంచ హోమియోపతి దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు హనుమకొండలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో ఉన్న శ్రీరామకృష్ణ సేవాసమితి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సమితి అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభు చైతన్య తెలిపారు. అలాగే ఓరుగల్లు హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ కూడా ఈ వివరాలను వెల్లడించారు. ఈ శిబిరాన్ని శ్రీరామకృష్ణ సేవా సమితి, ఓరుగల్లు హోమియోపతి మెడికల్ అసోసియేషన్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. శిబిరంలో అనుభవజ్ఞులైన హోమియోపతి వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించనున్నారు. నగర ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై హరీశ్ రావుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



నాదర్‌గుల్‌లో భూములను 2014లోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంస్థలకు అప్పగించిందని, వారి హయాంలోనే ఆ సంస్థల పేరిట రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. నాడు జరిగిన రిజిస్ట్రేషన్‌తో తమ ప్రభుత్వానికేం సంబంధమని మండిపడ్డారు. నాదర్‌గుల్ భూములను తమ ప్రభుత్వం హయాంలో కట్టబెట్టినట్లు ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. తమకు నాలా కన్వర్షన్ ఇవ్వలేదని భూములు పొందినవారు 2022లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆ భూములు ప్రభుత్వానివేనని కౌంటర్ దాఖలు చేశామని వెల్లడించారు. నాడు వాటాల కోసం భూములు కట్టబెట్టిన వారు ఇప్పుడు తమపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారానికి సంబంధించిన కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. కాగా, నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై ఇటీవల రాజకీయ దుమారం చెలరేగుతోంది. రూ.7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టిందని హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. అయితే ఈ భూమి యజమాని ఏక్యూ రియాల్టర్ అని చెబుతున్నారు. ఇది ప్రైవేటు భూమి అని హైకోర్టు, సుప్రీంకోర్టు గుర్తించాయని ఏక్యూ రియాల్టర్ అడ్వకేట్ ఇటీవల తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# బాల్య వివాహాల నివారణపై కట్టుదిట్టమైన చర్యలు

**టీజీఎస్సీపీసీఆర్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం, 08 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

బాలల హక్కుల పరిరక్షణతో పాటు బాల్య వివాహాల నిర్మూలనపై అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీజీఎస్సీపీసీఆర్) చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి సూచించారు. ఈ మేరకు కమిషన్ సభ్యులతో కలిసి ఖమ్మం జిల్లాను సందర్శించిన ఆమె, రఘునాథపాలెం మండలంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల విద్య హక్కు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ స్థాయిలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు (వీసీపీసిస్) మరింత చురుకుగా పనిచేసి, పిల్లల సమస్యలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని చైర్‌పర్సన్ సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనలో గ్రామస్థాయి యంత్రాంగం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే రఘునాథపాలెం మండలాన్ని బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు మాట్లాడుతూ, సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులను సమన్వయంతో పనిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థాయిలో బాలల హక్కులపై అవగాహన పెంచుతూ, వారి రక్షణకు కట్టుబడి పనిచేస్తామని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రామారావు మాట్లాడుతూ, ఖమ్మం జిల్లా పోలియో రహిత జిల్లాగా నిలిచిందని, ఆరోగ్యవంతమైన పిల్లల పెంపకం కోసం వైద్య శాఖ నిరంతరం సేవలందిస్తోందని తెలిపారు. బాలల హక్కుల కమిటీ సభ్యురాలు చందన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో చదువుతున్న పిల్లలు, చదువు మానేసిన పిల్లలు, స్కూల్‌కు వెళ్లని పిల్లల పూర్తి వివరాలు సర్పంచుల వద్ద ఉండాలని, ఆ ఆధారంగా బాలల పరిరక్షణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మరో సభ్యురాలు సరిత మాట్లాడుతూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు గ్రామ పెద్దలుగా సర్పంచులు కూడా పిల్లల రక్షణలో కీలక బాధ్యత వహించాలని పేర్కొన్నారు. సమీక్ష అనంతరం కమిషన్ బృందం ఖమ్మం రూరల్‌లోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. జిల్లాలోని గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు సమర్థవంతంగా పనిచేస్తున్నందుకు చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.



## మహిళల ఆరోగ్యంపై అవగాహన అత్యవసరం

**సురక్షిత మాతృత్వ దినోత్సవంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపు**






**హన్మకొండ, 08 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

మహిళల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడం అత్యంత అవసరమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు, ప్రభుత్వ కార్యక్రమాలపై డాక్టర్ అప్పయ్య, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుబీనా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ గర్భధారణకు ముందే మహిళల్లో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగంపై అవగాహన పెంపొందించడం కీలకమని తెలిపారు. ఇటీవల వైకల్యాలు, ఆటిజం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో గర్భధారణ ప్రణాళిక దశలోనే సరైన పోషకాహారం, వైద్య సలహాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రక్తహీనత (అనీమియా), సికిల్ సెల్ వంటి వ్యాధులపై ప్రజల్లో చైతన్యం పెంచాలని, హిమోగ్లోబిన్ లోపంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ముఖ్యంగా గర్భస్థ శిశువులో లోపాలను గుర్తించే టిఫ్ఫా స్కానింగ్‌ను నిర్దిష్ట సమయంలో తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ప్రసవానంతర దశలో మానసిక ఆరోగ్యంపైనా శ్రద్ధ అవసరమని, తల్లి–శిశు ఆరోగ్యం మెరుగుపడాలంటే కుటుంబ స్థాయిలో అవగాహన పెరగాలని పేర్కొన్నారు. సిజేరియన్ ప్రసవాలను తగ్గించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, కుటుంబ నియంత్రణపై అవగాహన పెంచాలని వైద్య అధికారులను ఆదేశించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని అన్నారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సురక్షిత మాతృత్వ దినోత్సవం నిర్వహించడం సంతోషకరమని అన్నారు. మాతృత్వం మహిళలకు దేవుడిచ్చిన గొప్ప వరమని పేర్కొన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం ఎంతో విలువైనవని, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం అత్యవసరమని అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచనల మేరకు 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు, శిశువుల ఆరోగ్యానికి సంబంధించిన ఆరు ముఖ్య అంశాలపై కార్యశాల నిర్వహించి, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సురక్షిత మాతృత్వంపై రూపొందించిన పోస్టర్లను ఎంపీ కడియం కావ్య, మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మహిళా అధికారులు పాల్గొన్నారు.

## ఇనగాల వెంకట్రామ్ రెడ్డి చేతుల మీదుగా 'శ్రీ ఐఖ్య డిజిటల్ ప్రింటింగ్ హబ్' ప్రారంభం



**హన్మకొండ, 08 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**



హనుమకొండ నగరంలోని నయీం నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఐఖ్య డిజిటల్ ప్రింటింగ్ హబ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి హబ్‌ను ప్రారంభించారు. శరణ్య హాస్పిటల్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ ప్రింటింగ్ హబ్ ద్వారా స్థానిక ప్రజలు, వ్యాపారులకు అత్యాధునిక డిజిటల్ ప్రింటింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హబ్ నిర్వాహకులను అభినందించిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఇటువంటి సంస్థలు స్థానిక వ్యాపార అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ఈ హబ్‌లో ఫ్లెక్స్ ప్రింటింగ్, యువీ డిజిటల్ ప్రింటింగ్, బ్యానర్లు, పుస్తకాల ముద్రణ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు వివరించారు. ఈ ప్రారంభంతో నయీం నగర్ పరిసర ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలకు మరింత ఊతం లభించనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మూగ బాలికపై సవతి తల్లి దారుణం

**హాస్పిటల్‌లోనే ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు**




**కాజీపేట, 08 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దారుణ ఘటన కలకలం రేపింది. 13 ఏళ్ల మూగ బాలికపై సవతి తల్లి అమానుషంగా హింసించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఎస్‌కే ఫాషా సిద్దికాపై జరిగిన ఈ దాడిపై పోలీసులు తక్షణమే స్పందించి కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, బాలిక తల్లి మరణించగా, తండ్రి అబూబాకర్ రజియా (35) అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. పండుగ సందర్భంగా తండ్రి వద్దకు వచ్చిన బాలికను సవతి తల్లి రజియా తీవ్రంగా హింసించింది. గుర్తు తెలియని వస్తువుతో బాలిక పిరుదులపై కాల్చి గాయపరిచినట్లు విచారణలో తేలింది. బాధితురాలు మూగదిగా ఉండటం, అలాగే తీవ్ర గాయాలతో బాధపడుతూ ఉండటంతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే పరిస్థితిలో లేకపోయింది. సమాచారం అందుకున్న కాజీపేట ఎస్ఐ బి. శివ తన సిబ్బందితో వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడే బాధితురాలి పరిస్థితిని పరిశీలించి, ఆమె అమ్మమ్మ ఎం.డి. సుల్తానా ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించారు. బాలిక మాట్లాడలేని పరిస్థితిలో ఉండటంతో చట్టపరమైన నిబంధనల ప్రకారం వాంగ్మూలాన్ని నమోదు చేసి, హాస్పిటల్‌లోనే ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం విశేషం. నిందితురాలు రజియాపై భారత న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్లు 115(2), 118(1) కింద ప్రమాదకర వస్తువులతో గాయపరచడం, జువెనైల్ జస్టిస్ చట్టం సెక్షన్ 75 కింద బాలలపై క్రూరత్వం, అలాగే ఆర్.పి.డబ్ల్యూ.డి చట్టం సెక్షన్ 92(సి) కింద దివ్యాంగురాలిపై హింస చేసిన కేసులు నమోదు చేశారు. చిన్నారులపై, ముఖ్యంగా దివ్యాంగులపై జరిగే దాడులను తీవ్రంగా పరిగణిస్తామని కాజీపేట పోలీసులు హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేసేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని, అవసరమైతే ఘటనా స్థలంలోనే ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## మార్చి నెలలో నిర్వహించిన లోక్ అదాలత్ విజయవంతం

**పోలీసు అధికారులకు ప్రశంస పత్రాల అందజేత**

**రామగుండం, 08 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**






మార్చి నెలలో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా, జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులు మరియు సిబ్బందిని అభినందించి, వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. వివిధ రకాల పెండింగ్ కేసులను పరస్పర అవగాహనతో త్వరితగతిన పరిష్కరించడంలో పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేసిందని జిల్లా జడ్జి పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలకు న్యాయం త్వరగా అందే విధంగా పోలీసు శాఖ చేసిన కృషిని కొనియాడారు. పోలీసు అధికారులు ప్రజలతో సమన్వయం కలిగి, న్యాయ వ్యవస్థతో కలిసి పనిచేయడం వల్లే ఈ లోక్ అదాలత్ విజయవంతమైందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవలు అందించాలని సూచించారు. డీసీపీ మాట్లాడుతూ...లోక్ అదాలత్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి న్యాయపరంగా సహకరించిన న్యాయ శాఖ వారికీ డిసిపి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందే విధంగా న్యాయస్థానం, పోలీసు శాఖల మధ్య ఉన్న సమన్వయం ప్రశంసనీయమని డీసీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సునీత కుంచాల, జిల్లా జడ్జి, కె. స్వప్న రాణి, అదనపు జిల్లా జడ్జి, వి. భావాని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, ఎన్. మంజుల, జూనియర్ సివిల్ జడ్జి, పెద్దపల్లి, గోదావరిఖని ఏసిపి ఎమ్ రమేష్ పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్ మంథని సిఐ రాజు, పి. రాకేష్ ఏ పిపి పెద్దపల్లి, ఎస్సైలు, పలువురు న్యాయమూర్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సికెఎం ఆసుపత్రిలో సురక్షిత మాతృత్వ దినోత్సవం

**తల్లి, శిశు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం**



**వరంగల్, 08 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య, ఆరోగ్య ౚ కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సి.కే.ఎం ప్రసూతి ఆసుపత్రిలో సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మానవతా దృక్పథంతో సేవలు అందిస్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తల్లి, శిశువు ఆరోగ్యానికి పోషకాహారం, సమయానుకూల వైద్య పరీక్షలు, సురక్షిత ప్రసవం ఎంతో అవసరమని వివరించారు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పిల్లలను ఆడ, మగ అనే తేడా లేకుండా సమానంగా పెంచాలని, వృద్ధ తల్లిదండ్రులను గౌరవించి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, చిన్న వయస్సులో వివాహాలు తల్లి, శిశువుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. లింగ వివక్షతను నిర్మూలించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గర్భధారణకు సరైన వయస్సు 23--25 సంవత్సరాల మధ్య ఉండటం ఉత్తమమని, గర్భిణీలు ఒత్తిడి లేకుండా సమతుల్య ఆహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గర్భంలో లింగ నిర్ధారణ చేయడం చట్టవిరుద్ధమని, ఆడ శిశువులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ, వివిధ శాఖల సమన్వయంతో ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గర్భిణీలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకుని వైద్యుల సూచనలు పాటించాలని కోరారు. సి.కే.ఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ, గర్భిణీలకు గర్భధారణ సమయంలో తొమ్మిది సార్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ అవసరమైన టీకాలు, పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి ఆసుపత్రిలోని ఓపీ, వార్డులను సందర్శించి గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. గర్భిణీలతో మాట్లాడి సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గణేష్, సంధ్యారాణి, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్ర రెడ్డి, జిల్లా అధికారులు, వైద్యులు, సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ డీజీపీ కాన్వాయ్ ట్రయల్ రన్‌లో ప్రమాదం.. స్వల్పంగా దెబ్బతిన్న వాహనాలు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి కాన్వాయ్ ట్రయల్ రన్ సందర్భంగా ప్రమాదం చోటు చేసుకుంది. డీజీపీ పర్యటనకు ముందు భద్రతా ఏర్పాట్లలో భాగంగా ములుగు జిల్లా వెంకటాపురం సమీపంలో పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ క్రమంలో వెంకటాపురం వద్ద వాహనాలు వేగంగా వెళుతుండగా ఒక పోలీసు వాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు వెంటనే ఆ వాహనాలను పక్కకు తొలగించారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి సువర్ణతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డి పర్యటించనున్నారు. కర్రెగుట్టలోని పామునూరు సీఆర్పీఎఫ్ బస్ క్యాంపును డీజీపీ పరిశీలిస్తారు. ఆ తర్వాత పోలీసు ఔట్ పోస్టుకు భూమి పూజ చేస్తారు. ఆ ప్రాంతంలోని గ్రామాలకు వేస్తున్న రోడ్లను పరిశీలిస్తారు. డీజీపీ కర్రెగుట్ట పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆయన స్థానిక గుత్తికోయలతో సమావేశం కానున్నారు.

# ఐపీఎల్‌లో బీసీసీఐ కొత్త రూల్... వాళ్లు ఇక డగౌట్‌కే పరిమితం!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) క్రమశిక్షణ దిశగా మరో కీలక అడుగు వేసింది. 2026 సీజన్ నుంచి అమల్లోకి వచ్చేలా ఒక కఠినమైన నిబంధనను ప్రవేశపెట్టింది. మ్యాచ్ సమయంలో మైదానం చుట్టూ అదనపు ఆటగాళ్ల (సబ్‌స్టిట్యూట్, బెంచ్ ఆటగాళ్లు) అనవసర కదలికలను పూర్తిగా నియంత్రించడమే ఈ కొత్త రూల్ ముఖ్య ఉద్దేశం. ఈ నిబంధన ఐపీఎల్‌లోని అన్ని జట్లకు వర్తిస్తుందని బీసీసీఐ స్పష్టం చేసింది.గతంలో మ్యాచ్ సమయంలో డగౌట్‌లో ఉన్న ఆటగాళ్లు డ్రింక్స్ తీసుకురావడం, సహచరులకు సందేశాలు అందించడం, వార్మప్ చేయడం వంటి కార్యకలాపాల కోసం బౌండరీ లైన్ వద్ద స్వేచ్ఛగా తిరిగేవారు. అయితే, దీనివల్ల మైదానం పరిసరాల్లో గందరగోళం నెలకొనడంతో పాటు, కొన్నిసార్లు మ్యాచ్‌కు ఆటంకం కలుగుతోందని బీసీసీఐ భావించింది. ఈ నేపథ్యంలో, ఆటను మరింత సజావుగా, వృత్తిపరంగా నిర్వహించేందుకు ఈ కొత్త నియమావళిని రూపొందించింది. ఈ నిబంధనల గురించి ఇప్పటికే జట్లకు సమాచారం అందించినట్టు తెలుస్తోంది.

కొత్త నిబంధనలోని ముఖ్యాంశాలు:

మ్యాచ్ కోసం ప్రకటించిన 16 మంది ఆటగాళ్లకు మాత్రమే మైదానం పరిసరాల్లో తిరిగేందుకు అనుమతి ఉంటుంది. డ్రింక్స్ అందించడం వంటి పనులు కూడా వీరే చేయాలి.అఈ 16 మంది కాకుండా స్క్వాడ్‌లోని మిగతా ఆటగాళ్లు పూర్తిగా డగౌట్‌కే పరిమితం కావాలి. మైదానంలోకి అడుగుపెట్టడానికి వీల్లేదు.అసబ్‌స్టిట్యూట్‌లలో గరిష్ఠంగా ఐదుగురు ఆటగాళ్లు మాత్రమే (బిబ్స్ ధరించి) బౌండరీ లైన్ దగ్గర వార్మప్ లేదా ఇతర కార్యకలాపాల కోసం నిలబడవచ్చు. అబౌండరీ లైన్‌కు, ఎల్‌ఈడీ అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులకు మధ్య ఉన్న ప్రాంతంలో ఇతర ఆటగాళ్ల కదలికలను పూర్తిగా నిషేధించారు. ఈ మార్పులపై ఓ జట్టు వర్గాలు స్పందిస్తూ, "మ్యాచ్ సమయంలో సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు ఎవరూ కదలకూడదని, డ్రింక్స్ కూడా తీసుకురాకూడదని మాకు ఇటీవలే సూచనలు అందాయి. మ్యాచ్‌కు ఎంపిక చేసిన 16 మంది మాత్రమే ఆ పనులు చేయగలరు. మిగిలిన వారు డగౌట్‌లోనే కూర్చోవాలి" అని వివరించాయి. సాధారణంగా ఐపీఎల్ జట్ల స్క్వాడ్‌లో 25 మంది వరకు ఆటగాళ్లు ఉంటారు. కొత్త నిబంధనతో మ్యాచ్ ఆడని ఆటగాళ్ల కదలికలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడనుంది. అయితే, ఈ మార్పుకు గల అధికారిక కారణాలను బీసీసీఐ ఇంకా వెల్లడించలేదు. ఈ నియమం వల్ల మ్యాచ్‌ల ప్రసార సమయంలో మైదానం చుట్టూ అనవసర రద్దీ తగ్గి, మరింత ప్రొఫెషనల్ లుక్ వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# బుమ్రాలోనూ భయం పుట్టించాడు: వైభవ్ సూర్యవంశీపై డేల్ స్టెయిన్ ప్రశంసలు



రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తన దూకుడైన బ్యాటింగ్‌తో బౌలర్లపై మానసికంగా ఆధిపత్యం చెలాయిస్తున్నాడని, చివరికి జస్‌ప్రీత్ బుమ్రా లాంటి మేటి బౌలర్లను కూడా తప్పిదాలు చేసేలా ఒత్తిడికి గురిచేస్తున్నాడని దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ ప్రశంసించాడు. సూర్యవంశీ బౌలర్ల గుండెల్లో భయాన్ని నింపుతున్నాడని ఆయన అభిప్రాయపడ్డాడు.మంగళవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా వేసిన తొలి బంతినే సూర్యవంశీ మిడ్-ఆన్ మీదుగా బౌండరీ తరలించిన విషయాన్ని స్టెయిన్ గుర్తుచేశాడు. "బుమ్రా వేసిన ఆ బంతి స్లాట్‌లో పడింది. బుమ్రా నుంచి ఇలాంటి బంతి రావడం చాలా అరుదు. 'తప్పు చేస్తే సిక్స్ కొడతాడు' అని బుమ్రా మదిలో కూడా మెదిలి ఉంటుంది. అలా అనుకున్నప్పుడు చాలాసార్లు పొరపాట్లు జరుగుతాయి. సరిగ్గా అదే జరిగింది," అని స్టెయిన్ వివరించాడు. సూర్యవంశీకి భయం లేదని, ఎదురుగా ఉన్న బౌలర్ ఎవరైనా సరే, చెత్త బంతి వేస్తే శిక్షించడం ఖాయమని స్టెయిన్ అన్నాడు. "ఆ కుర్రాడికి భయమంటే తెలియదు. బౌలర్ బుమ్రా అయినా, సాధారణ బౌలర్ అయినా సరే.. బంతి మిస్ అయితే బౌండరీ దాటాల్సిందే. ఇది అద్భుతమైన బ్యాటింగ్" అని కొనియాడాడు. గౌహతిలో వర్షం కారణంగా కుదించిన ఈ మ్యాచ్‌లో, యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ తొలి వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం అందించారు. సూర్యవంశీ కేవలం 14 బంతుల్లో 39 పరుగులు చేయగా, జైస్వాల్ 32 బంతుల్లో 77 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్‌లో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది.

# ఒక్క పరుగు తేడాతో గెలిచిన గుజరాత్... ఉత్కంఠ పోరులో ఢిల్లీ ఓటమి



ఐపీఎల్ 2026లో మరో ఉత్కంఠభరిత మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ పోరులో గుజరాత్ టైటాన్స్ కేవలం ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై థ్రిల్లింగ్ విజయం సాధించింది. చివరి ఓవర్‌లో ఢిల్లీ విజయానికి 13 పరుగులు అవసరమైన దశలో, బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేసి గుజరాత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.చివరి ఓవర్ తొలి బంతికే విప్రాజ్ నిగమ్ ఫోర్ కొట్టడంతో ఢిల్లీ గెలుపు ఖాయమనిపించింది. కానీ, తర్వాతి బంతికే నిగమ్‌ను ఔట్ చేసిన ప్రసిద్ధ్, మ్యాచ్‌ను గుజరాత్ వైపు తిప్పాడు. నాలుగో బంతిని డేవిడ్ మిల్లర్ సిక్సర్‌గా మలచడంతో సమీకరణం 2 బంతుల్లో 2 పరుగులుగా మారింది. ఐదో బంతికి పరుగు రాకపోవడంతో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. చివరి బంతికి 2 పరుగులు అవసరం కాగా, మిల్లర్ షాట్ మిస్ అవ్వగా.. పరుగు కోసం ప్రయత్నించిన కుల్దీప్ రనౌట్ కావడంతో గుజరాత్ సంబరాల్లో మునిగిపోయింది. 211 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ చివరి వరకు పోరాడింది. కేఎల్ రాహుల్ (52 బంతుల్లో 92) అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును గెలుపు అంచుల వరకు తెచ్చాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (20 బంతుల్లో 41) మెరుపులు మెరిపించినా ఫలితం లేకపోయింది. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 17 పరుగులిచ్చి 3 వికెట్లతో ఢిల్లీని దెబ్బకొట్టాడు. అంతకుముందు, గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 210 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (70), జోస్ బట్లర్ (52), వాషింగ్టన్ సుందర్ (55) అర్ధ సెంచరీలతో జట్టుకు భారీ స్కోరు అందించారు.

# గిల్ ధమాకా... బట్లర్, సుందర్ బాదుడు.. గుజరాత్ టైటాన్స్ భారీ స్కోరు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఖ్రూా) 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న 14వ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్, నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (70), జోస్ బట్లర్ (52), వాషింగ్టన్ సుందర్ (55) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దీంతో ఢిల్లీ ముందు 211 పరుగుల కొండంత లక్ష్యాన్ని నిర్దేశించారు.


బట్లర్ విధ్వంసం.. గిల్ బాధ్యతాయుత ఇన్నింగ్స్

టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ఢిల్లీకి ఆరంభంలోనే చిన్న ఊరట లభించింది. ఇన్నింగ్స్ మూడో ఓవర్లో సాయి సుదర్శన్ (12) ముకేశ్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జోస్ బట్లర్.. ఢిల్లీ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా బట్లర్ తనదైన శైలిలో సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 27 బంతుల్లోనే 3 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో 52 పరుగులు చేసి పెను విధ్వంసం సృష్టించాడు. ఈ క్రమంలో గిల్‌తో కలిసి రెండో వికెట్‌కు 60 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ప్రమాదకరంగా మారుతున్న బట్లర్‌ను స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పెవిలియన్ పంపడంతో ఢిల్లీ శిబిరం ఊపిరి పీల్చుకుంది.

కెప్టెన్, సుందర్ సెంచరీ భాగస్వామ్యం బట్లర్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్‌తో కలిసి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఒకవైపు బాధ్యతాయుతంగా ఆడుతూనే, మరోవైపు చెత్త బంతులను బౌండరీలకు తరలించాడు. సుందర్ కూడా అద్భుతంగా రాణించడంతో గుజరాత్ స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఈ ఇద్దరూ కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 104 పరుగుల సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో గిల్ 45 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 70 పరుగులు చేసి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు సుందర్ కేవలం 32 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 55 పరుగులు చేసి జట్టు స్కోరును 200 దాటించడంలో కీలక పాత్ర పోషించాడు.

తేలిపోయిన ఢిల్లీ బౌలింగ్

గుజరాత్ బ్యాటర్ల ధాటికి ఢిల్లీ బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. కెప్టెన్ అక్షర్ పటేల్ సహా అందరూ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ముకేశ్ కుమార్ 4 ఓవర్లలో 55 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీయగా, కుల్దీప్ యాదవ్ 42 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. ఒక్క లుంగి ఎంగిడి మాత్రమే పొదుపుగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో 24 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. చివరి ఓవర్లలో గ్లెన్ ఫిలిప్స్ (14లి) కూడా మెరుపులు మెరిపించడంతో గుజరాత్ స్కోరు 210 పరుగులకు చేరింది.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem





# నా జీవితంలో ఒక బ్రేకప్ ఉంది: కృతి శెట్టి

'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టి, 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' (వా.×.ఖ) సినిమా విడుదలకు సిద్ధమైంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్లలో ఈ ఇద్దరు సెలబ్రిటీలు తమ బ్రేకప్స్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాయి.కృతి శెట్టి మాట్లాడుతూ... తనకు గతంలో ఒకసారి బ్రేకప్ జరిగిందని వెల్లడించింది. ఈ విషయం తన తల్లికి కూడా తెలుసని, ప్రస్తుతం మాత్రం తాను సింగిల్‌గా ఉన్నానని స్పష్టం చేసింది. అలాగే సోషల్ మీడియాలో తనపై నెగిటివిటీ ప్రచారం చేసే వారిని ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే బ్లాక్ చేస్తానని ఆమె క్లారిటీ ఇచ్చింది. ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ... తన లైఫ్ లో ఒకటి కాదు, చాలా బ్రేకప్స్ జరిగాయని నవ్వుతూ చెప్పాడు. అవతలి వాళ్లే తనను బ్లాక్ చేశారని నిజాయతీగా ఒప్పుకున్నాడు. కాలేజీ రోజుల్లో అమ్మాయిల మెసేజ్‌లకు తాను చాట్ జీపీటీ కంటే వేగంగా రిప్లై ఇచ్చేవాడినని, అంతలా కష్టపడినా చివరకు సింగిల్‌గానే మిగిలిపోయానని సరదాగా వ్యాఖ్యానించాడు.

## వాటికి దూరంగా ఉండండి యువతకు రజనీకాంత్ కీలక సూచన

సూపర్‌స్టార్ రజనీకాంత్ యువతను ఉద్దేశించి అత్యంత కీలకమైన, భావోద్వేగపూరితమైన సందేశాన్ని ఇచ్చారు. సినిమాల్లోని సాహసాలను చూసి నిజ జీవితంలో ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన హితవు పలికారు.ప్రస్తుత కాలంలో యువత తప్పుడు మార్గాల్లో వెళ్లడంపై రజనీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డ్రగ్స్, మద్యం వంటి భయంకరమైన వ్యసనాలకు బానిసలైతే తమ జీవితాలే కాకుండా, వారిని నమ్ముకున్న తల్లిదండ్రుల జీవితాలు కూడా నాశనమవుతాయని హెచ్చరించారు. "క్రమశిక్షణ లేని జీవితం నరకంతో సమానం" అని ఆయన స్పష్టం చేశారు.సినిమాల్లో హీరోలు చేసే స్టంట్లు చూసి స్ఫూర్తి పొంది రోడ్లపై బైక్ రేసింగ్‌లు చేయడం ప్రాణాపాయమని, అటువంటి పనులకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశలో చదువుపైనే పూర్తి నిబద్ధతతో ఉండాలని, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. అలవాట్లు సరిగ్గా లేని స్నేహితులకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యతని గుర్తుచేశారు. తన సినిమాల గురించి మాట్లాడుతూ... అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. అలాగే సిబి చక్రవర్తి దర్శకత్వంలో, కమల్ హాసన్ నిర్మాణంలో రాబోతున్న 'తలైవర్ 173' ప్రాజెక్ట్ విశేషాలను కూడా పంచుకున్నారు.



# నేను ముందే చూశాను.. మీకు తెలీదు ట్రోలర్లకు దీపిక ఘాటు సమాధానం

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' సినిమా సృష్టిస్తున్న ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఈ చిత్రం ఏకంగా రూ. 1000 కోట్ల మార్క్‌ను దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. అయితే, భర్త రణ్‌వీర్ సింగ్ సాధించిన ఈ భారీ విజయంపై దీపికా పదుకొణె ఎందుకు స్పందించడం లేదని గత కొన్ని రోజులుగా ట్రోల్స్ వస్తున్నాయి. తాజాగా ఈ విమర్శలపై దీపిక తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు.దీపిక తన భర్త సినిమా ఎందుకు చూడటం లేదు? ఆ సినిమా గురించి ఎందుకు మాట్లాడటం లేదు? అనే పోస్ట్‌పై ఆమె స్పందించారు. "మీ అందరికంటే ముందే నేను ఆ సినిమాను చూశాను. ఈ విషయం మీకు తెలియదు. ఇప్పుడు చెప్పండి.. ఎవరు ఎవరిని విమర్శించాలి?" అంటూ వ్యంగ్యంగా రిప్లై ఇచ్చారు. సోషల్ మీడియాలో పోస్ట్‌ల ఆధారంగా ప్రేమనో, మద్దతునో కొలవలేమని ఆమె ఈ రిప్లై ద్వారా స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టనంత మాత్రాన తన భర్తకు మద్దతు ఇవ్వడంలేదు అనుకోవడం సరికాదని అన్నారు. మరోవైపు, ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు ఆర్. మాధవన్, అక్షయ్ ఖన్నా వంటి స్టార్స్ కీలక పాత్రలు పోషించారు. విడుదలైన రోజు నుండి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తూనే ఉంది.